క్లుప్తంగా

కూలిన చెట్ల తొలగింపు



తాటి చెట్టును తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

గోపాలపట్నం: ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన తాటి చెట్లను జీవీఎంసీ అధికారులు తొలగించారు. జీవీఎంసీ 92వ వార్డు శ్రీరామ్ నగర్‌లో ఈదురు గాలులు, వర్షానికి తాటి చెట్లు పడి పోయాయి. వీటిని జీవీఎంసీ అధికారులు తొలగించారు.అలాగే పూడికలు తొలగించారు.

వీధిలైట్ల ఏర్పాటు



వైర్లు లాగుతున్న విద్యుత్ సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు శాంతిగిరికాలనీలోని విద్యుత్ స్తంభాలకు కొత్తగా వైర్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో వీధి లైట్లు లేకపోవడంతో కాలనీ వాసులు రాత్రి సమయంలో ఇబ్బంది పడేవారు. ఇక్కడ విద్యుత్ స్తంభాలే వేసినా వైర్లు అమర్చలేదు.దీంతో సీపీఎం నాయకులు శ్రీహరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేయడంతో స్పందించిన అధికారులు స్తంభాలకు విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసి,వాటికి లైట్లు అమర్చారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతలలోవ గ్రామంలో సుమారు రూ.16 లక్షల జీవీఎంసీ నిధులతో రోడ్డు విస్తరణ, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శుక్రవారం కార్పొరేటర్ గల్లా చిన్నా భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో పలు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, నాయకులు జెర్రిపోతుల నర్సింగరావు, గూడెల కృష్ణ, ధనుంజయ్, రమణ తదితరులు పాల్గొన్నారు. .

సమ్మె నోటీసు అందజేత



భెల్ ఈడీ సుబ్రమణ్యంకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ ప్రొగ్రెసివ్ ఫ్రంట్ (ఇంటక్, సీటు) నాయకులు శుక్రవారం యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న దేశవ్యాప్తంగా సమ్మె చేయాలని జాతీయ కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయి. అందులో భాగంగా జాతీయ సమస్యలతో పాటు భెల్ సమస్యలపై సంస్థ ఈడీ జి. సుబ్రమణ్యంకు సమ్మె నోటీసు ఇచ్చారు. కార్యక్రమంలో జి.టి.పి. ప్రకాశ్, సీతన్న నాయుడు, ఆర్. జనార్దనరావు, పి. ఆనందకుమార్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఫైనాన్స్ విభాగాధిపతికి అభినందనలు



స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ నూతన విభాగాధిపతిని సత్కరిస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ విభాగాధిపతి హేమంత్ కుమార్ ఝాను ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు అభినందించారు. నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను శుక్రవారం సీ నాయకులు కలిసి సత్కరించారు. నాలుగు నెలలుగా స్టీల్‌ప్లాంట్ మెరుగైన పనితీరు కనబరిచిందని, కష్టాలు ఎదురైనా ఉద్యోగులు మంచి ఫలితాలు సాధించారన్నారు. కార్యక్రమంలో సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, ఉపాధ్యక్షుడు టి. శ్రీనివాసరావు, కోశాధికారి పి. లోకేష్, సభ్యులు కె. ప్రశాంత నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఈ వ్యర్థాలకు బాధ్యులెవరు?



గోపాలపట్నం వుడా కాలనీలో తొలగించిన చెట్ల కొమ్మలు

గోపాలపట్నం: విద్యుత్ శాఖ సిబ్బంది చెట్ల కొమ్మలు తొలగించి రోడ్లపై పడేయడంతో స్థానికులు, పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. తొలగించిన కొమ్మలను రోడ్లపై నుంచి వెంటనే తొలగించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది.

ఇదీ పరిస్థితి

విద్యుత్ సరఫరాకు అడ్డంకిగా ఉన్నాయంటూ జంగిల్ క్లియరెన్స్ పేరిట చెట్ల కొమ్మలు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తొలగిస్తున్నారు. ఈ బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగిస్తారు. కాంట్రాక్టర్ చెట్ల కొమ్మలు తొలగించి వాటిని వారి వాహనంతో వేసుకుని నిర్దేశించిన ప్రాంతంలో వేయాలి. కాని వీరు అలా చేయడం లేదు. చెట్ల కొమ్మల వ్యర్థాలను ఎక్కడికక్కడ పడేసి వెళ్లిపోతున్నారు. విద్యుత్ శాఖ వారే తొలగిస్తారని జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది కూడా చూసీ చూడనట్లు వ్యవహరించడంతో **నాలుగైదు రోజులు వరకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కొన్ని చోట్ల తొలగించిన కొమ్మలు చెట్లకు వేలాడుతూ కనిపిస్తున్నాయి. ఇవి ఎవుడు** రాలుతాయో ఎవరి మీద పడతాయో తెలియని విధంగా ఉన్నాయంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్టరే కొమ్మలు తరలించాలి

కొట్టిన చెట్ల కొమ్మలను కాంట్రాక్టర్ వెంటవెంటనే తొలగించాలి. కాని అలా చేయడం లేదు. కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చే విధంగా విద్యుత్ అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వీటిని తొలగించాలంటే ప్రత్యేకంగా ఒక వాహనం ఏర్పాటు చేసుకోవాలి. చెట్ల కొమ్మలు లోడింగ్‌చేసేందుకు పొక్‌లెనైర్ లేదా.. మరో యంత్రం ఏర్పాటు చేయాలి. కొమ్మలు తొలగించి పడేస్తే వీటి అవసరం ఉండదు. వాటికి అయ్యే ఖర్చు లక్షల్లో మిగులుతుంది. నాలుగు రోజులు గడిచే సరికి వీటి ఒత్తడి జీవీఎంసీ పారిశుధ్య కార్మికులపై పడడంతో శుభ్రం చేస్తారని విద్యుత్ శాఖ అధికారులు ధీమా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ప్రజల ఇబ్బందులు గుర్తించి చెట్ల కొమ్మలు వెంటవెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రోడ్డులో ఇలా చెట్లకొమ్మలు

వర్షానికి కూలిన ప్రభుత్వ పాఠశాల ప్రహరీ



కూలిన ప్రభుత్వ పాఠశాల ప్రహరీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురం ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గురువారం రాత్రి కూలిపోయింది. సమాచారం తెలుసుకున్న 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకుని కూలిన ప్రహరీని పరిశీలించారు. వెంటనే పునర్నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ క్రిస్టియన్‌సెల్ అధ్యక్షుడు డాక్టర్ చింతాప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు వృద్ధుడు



వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న మమత

గోపాలపట్నం: నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధుడిని కుటుంబం చెంతకు బుచ్చిరాజుపాలెం నైట్ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత చేర్చారు. ఆమె తెలిపిన వివరాలు... ఎన్‌ఏడీ పరిసరాల్లో తిరుగుతున్న వృద్ధుడిని మమత తీసుకువచ్చి షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. నాలుగు రోజుల తర్వాత వృద్ధుడి వివరాలు సేకరించింది. అతని పేరు పురుషోత్తం ప్రధాన్ అని, తనది రాజమండ్రి దగ్గర కడిపిలంక అని తెలిపాడు. రాజమండ్రిలో ఉన్న కుటుంబ సభ్యులు వివరాలు తెలుసుకుని సమాచారమందించారు. దీంతో అతని కుటుంబ సభ్యులు వచ్చి వృద్ధుడిని తీసుకు వెళ్లారు. తిరుపతి యాత్రకు వెళ్లిన సమయంలో తప్పి పోయిన తమ తండ్రి తిరిగి దొరకడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇదేం చెత్తపని!

ఆ ప్రాంత వాసుల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోరుబావి ఆవరణను డంపింగ్ యార్డుగా మార్చేస్తున్నారు. దీని నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. 61వ వార్డు మల్కాపురం దరి ఆర్‌కేపురం నుంచి సెయింట్ జోసెఫ్ పాఠశాలకు వెళ్లే మార్గంలో బోరబావి ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో స్థానిక మహిళలు నీటిని పట్టుకుంటారు.అయితే ఈ బోరుబావి కొంత కాలం నుంచి పని చేయడం లేదు.అధికారులు దీన్ని వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో స్థానికులు వ్యర్థాలను బోరు చుట్టూ డంప్ చేశారు. ఇది చూసిన పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



ఫోకస్

– మల్కాపురం

అంగన్‌వాడీ కేంద్రాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం



యల్లపువానిపాలెం ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

గోపాలపట్నం: అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర వికాసం పేరిట కిశోర బాలికలకు వేసవి శిక్షణా కార్యక్రమాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయని ఐసీడీఎస్ సింహాచలం సెక్టార్ సూపర్‌వైజర్ జె.టి.ఎస్. జ్యోతి తెలిపారు.మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ అధికారి ఎం.వి.రమణకుమారి ఆదేశాల మేరకు ఏసీడీపీవో శ్రీలత పర్యవేక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను జూన్ 10వ తేదీ వరకూ నిర్వహించనున్నామన్నారు.శిబిరాలకు సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు కన్వీనర్లుగా వ్యవహరించనున్నారన్నారు. తొలి రోజు శుక్రవారం శిక్షణలో భాగంగా యల్లపువానిపాలెం ఎస్సీకాలనీ, యల్లపువానిపాలెం, సంతోషనగర్ అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు పలు అంగన్‌వాడీ కేంద్రాలలో ఆయా అంగన్‌వాడీల టీచర్ల ఆధ్వర్యంలో బాలికా వికాసం పేరిట బాలికల పరిచయాలు , లక్ష్యాలు గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఈర్ల దేవి, శాంతి,చంద్రకళ, సంతోషిలతో పాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు , కిషోర బాలికలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పాత కరాసాలో యూజీడీ పనుల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు పాతకరాసాలో యూజీడీ పనులను వార్డు కార్పొరేటర్ జియ్యాని శ్రీధర్ శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 5 నుంచి గ్రామ దేవతలు బంగారమ్మ దుర్గాలమ్మ పండగ ఉన్న నేపథ్యంలో పనులు వేగవంతం చేయాలని సూచించారు. గ్రామంలో ఘటాలు తిరుగుతాయని.. వాటికి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. పర్యటనలో వాటర్ వర్క్స్ ఏఈ సుమన్, సన్యాసిఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు చట్టాలపై అవగాహన



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

గాజువాక: అసంఘటిత కార్మికుల హక్కులు, విధులు అవగాహన వారోత్సవాల్లో భాగంగా గాజువాక మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 13వ అదనపు జిల్లా జడ్జి జి.షన్ముఖరావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అత్యంత బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు మద్యపానం చేయవద్దన్నారు. ఆటోకు ఇన్సూరెన్స్ లేకుండా నడపవద్దని సూచించారు. ఇన్సూరెన్స్ లేని సమయంలో ఎలాంటి ప్రమాదం జరిగినా బాధితులకు డ్రైవర్లు తమ సొంత డబ్బుతో పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. దీనివల్ల అనేక అనర్థాలు జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ, లేబర్ ఆఫీసర్ వై.నరేష్, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు యశోధర వేదమణి, డి.చిరంజీవి, కోశాధికారి గిల్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు సత్కారం

ఉక్కునగరం: స్టీల్ ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కొమ్ము ప్రసాదరావును శుక్రవారం వివిధ విభాగాధిపతులు, కార్మిక సంఘాల నాయకులు సత్కరించారు. కోక్‌ఓవెన్స్ విభాగాధిపతి ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ తదితరులు ప్రసాద్‌కు బొకే అందజేసి అభినందించారు. కార్యక్రమంలో గోపాలరాజు, తాండ్ర కనకరాజు, టి.వి.కె. రాజు పాల్గొన్నారు. కార్మికుల పక్షాన పోరాటం చేస్తానని ప్రసాదరావు పేర్కొన్నారు.

అడ్డదిడ్డంగా ఆటోలు



ములగాడ హౌసింగ్‌కాలనీ సేవా మార్గం వద్ద అడ్డంగా నిలిపిన ఆటోలు



ఆండాలమ్మ కళాశాలకు వెళ్లే మార్గంలో అడ్డంగా నిలిపిన ఆటోలు

- రాకపోకలకు అవస్థలు

మల్కాపురం: ఆటోలు కూడళ్లు, సేవా మార్గాల్లో అడ్డంగా నిలపడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యపై అధికారులు స్పందించకపోవడంతో పరిస్థితి అదుపుతప్పుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీ నుంచి గాజువాకకు వెళ్లే దిగువ మార్గంలో పలువురు ఆటో డ్రైవర్లు ప్రయాణికుల కోసం రోడ్డుకు అడ్డంగా నిలుపుతున్నారు.ఆ సమయంలో ఆ మార్గాన విధులకు,కళాశాలలు,వివిధ పనులపై వెళ్లే ద్విచక్ర వాహనదారులకు మార్గం లేకుండా చేస్తున్నారు. అలాగే ములగాడ హౌసింగ్‌కాలనీ నుంచి ఆండాలమ్మ కళాశాలకు వెళ్లే మలుపులో ఆటోలను అడ్డంగా నిలుపుతున్నారు. దీంతో మలుపును గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. సేవా మార్గంలో అడ్డంగా పెడుతున్న ఆటో డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

హోటల్స్ క్రికెట్ లీగ్ ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న హోటల్స్ సంఘం ప్రతినిధులు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ సంఘం(హెచ్‌ఆర్‌ఏపీ) ఆధ్వర్యంలో మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం అంతర హోటల్స్ క్రికెట్ లీగ్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 16 హోటల్ జట్లు పాల్గొంటున్నాయి. హోటల్స్ సంఘం అధ్యక్షుడు ప్రశాంత్ తొలి మ్యాచ్‌ను ప్రారంభించారు. హోటల్ సిబ్బంది మధ్య స్నేహపూరిత వాతావరణాన్ని, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే ఈ పోటీల ఉద్దేశమని సంఘం ఉపాధ్యక్షుడు పవన్ కార్తీక్ ఈ సందర్భంగా తెలిపారు. స్టార్ కేటగిరీ హోటల్స్ మేనేజర్లు, హెచ్‌ఆర్ మేనేజర్లు పాల్గొన్నారు. టోర్నీలో భాగంగా తొలిరోజు మూడు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో ది పార్క్ హోటల్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. మేఘాలయ హోటల్ నిర్దేశించిన 47 పరుగుల విజయ లక్ష్యాన్ని కేవలం 4.4ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. రెండో మ్యాచ్‌లో రాక్‌డేల్ హోటల్ జట్టు నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. ఐటీ ఫార్చ్యూన్ ఇన్ జట్టు తొమ్మిది వికెట్లు కోల్పోయి 91 పరుగులే చేసి ఓటమి పాలైంది. మూడో మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పామ్ బీచ్ జట్టు కేవలం రెండు వికెట్లు కోల్పోయి 188 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయల్ ఫోర్ట్ హోటల్ జట్టు ఏడు వికెట్లు కోల్పోయి 47 పరుగులు మాత్రమే చేయగలిగింది.

శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్



కార్డన్‌సెర్చ్‌కు సిద్ధమవుతున్న పోలీసులు



స్థానికులను ఆరా తీస్తున్న పోలీసులు



కల్లుపాకలు ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం: నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని విశాఖ టూటౌన్ సీఐ వి.వి.సి.ఎం. ఎర్రంనాయుడు అన్నారు. ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం వేకువ జాము నుంచి పూర్ణామార్కెట్, కల్లుపాకలు తదితర ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 50 మంది పోలీస్ సిబ్బంది చుట్టుముట్టడంతో ప్రజలు ఆందోళన చెందారు. పోలీసులు వివరాలు చెప్పడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేశారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలపై ఆరా తీశారు. తనిఖీలలో వాహనాలకు నంబర్ ప్లేట్ సరిగా లేని 11 వాహనాలపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు అతి వేగంగా, అజాగ్రత్తగా నడపవద్దని కోరారు. వీటితో కలిగే ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాహనాలు నడిపేవారు అన్ని ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని, సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయంలో మహిళలు శక్తి యాప్ వినియోగించుకోవాలని, ఈ యాప్ మహిళల భద్రత కోసమే ప్రత్యేకంగా రూపొందించిందని సీఐ ఎర్రంనాయుడు తెలిపారు. ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టూటౌన్, మహారాణిపేట, త్రీటౌన్, ఫోర్త్ టౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

పాతనగరంలో..

దాబాగార్డెన్స్: శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు కేజీహెచ్‌కు ఆనుకుని ఉన్న వార్డుభాయి లేన్‌లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అనుమానితులు ఉన్నారా? లేదా ఆరా తీస్తూ.. ఇంటింటిని తనిఖీ చేశారు. వాహనాల డాక్యుమెంట్లు పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల సమాచారం సేకరించడం వంటి చర్యలు చేపట్టారు. తనిఖీలో అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం ఉన్న అనుమానితులను గుర్తించడానికి ప్రత్యేక దృష్టి పెట్టినట్టు వన్‌టౌన్ సీఐ జీడీ బాబు తెలిపారు. ఆపరేషన్‌లో ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణకు స్టేషన్‌కు తరలించారు. 11 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఆపరేషన్‌లో వన్‌టౌన్ సీఐతో పాటు ఎస్సై లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఆపరేషన్ కగార్’ను నిలిపివేయాలి

సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేత వెంకటేశ్వర్లు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల, పార్టీల నాయకులు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కర్రెగుట్ట నిర్బంధాన్ని తక్షణమే విరమించి, మావోయిస్టుల ఏరివేత పేరుతో ప్రవేశపెట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ విశాఖ, విజయనగరం జిల్లాల ఏరియా కమిటీ నేత ఎం.వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వివిధ ప్రజా సంఘాలు, పార్టీలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలను సమూలంగా నిర్మూలించి అటవీ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పే లక్ష్యంతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఈ దమనకాండకు పాల్పడుతోందని ఆరోపించారు. తక్షణమే ఈ నరమేధాన్ని ఆపి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు పైడిరాజు మాట్లాడుతూ రాజమండ్రి నుంచి రాయ్‌పూర్ వరకు ఎనిమిది లైన్ల రహదారులను అందంగా వేస్తున్నది ప్రజల కోసం కాదని, కార్పొరేట్ల కోసమే అన్నారు. అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ల సంతోషం కోసం అమాయక గిరిజనులందరినీ అణచివేసి, ఖనిజ సంపదను దోచిపెట్టడానికి కుట్రలు పన్నుతున్నారన్నారు. అందుకనే కశ్మీర్‌లో అధికరణ 370 రద్దు చేశారని, అలాగే మణిపూర్‌లో చిచ్చు పెట్టి.. ఇప్పుడు కర్రెగుట్టలో మొత్తం సైన్యాన్ని దింపారని తెలిపారు. భవిష్యత్‌లో ప్రజా సంఘాల నేతలు, హక్కుల నేతలపై దాడి జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ధర్నాలో పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, సీపీఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు దేవా, సీపీఎం నేత మణి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మేంద్ర, విద్యా పరిరక్షణ కమిటీ ప్రతినిధి కిశోర్, అరుణోదయ నిర్మల, న్యాయవాదులు కె.ఎస్.చలం, సురేష్, ఎంఎస్‌యుఎస్ పూర్వ అధ్యక్షుడు కె.రవి, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాత లు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ. 500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో శంకరాచార్యుల జయంతి..

జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ వేదపండితులు, అర్చక స్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో ఏఈవో రాజేంద్రకుమార్, పర్యవేక్షకుడు తిరుపతిరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.